క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వజ్రం అపార్ట్‌మెంట్స్, ఎన్ వీడియా, నానక్‌రాంగూడ, ప్రైమ్ అపార్ట్‌మెంట్స్, ఐఐఆర్‌ఎం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నానక్‌రాంగూడ విలేజ్, సుమధుర అపార్ట్‌మెంట్స్, ది శ్రీరాం స్కూల్, గోల్ఫ్ వ్యూ అపార్ట్‌మెంట్స్, బౌల్డర్‌హిల్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

శేరిలింగంపల్లి: చందానగర్ సబ్‌స్టేషన్ పరిధి హుడాకాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ ప్రాంతంలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఉమారాణి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హుడాకాలనీ మొత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

శాంతినగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో..

శాంతినగర్‌లోని 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో..మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాంతినగర్, చందానగర్ ప్రధానరోడ్డు ప్రాంతంలో విద్యుత్ ఉండదని తెలిపారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో 'రీ ఆర్గనైజింగ్ ది మెంటల్ స్పేస్' అనే అంశంపై హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ బి.కె. రామకృష్ణ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.

శ్రీశైలంకు సూపర్ లగ్జరీ బస్సులు

మియాపూర్ : మహా శివరాత్రి పండగను పురస్కరించుకుని శ్రీశైలానికి వెళ్లే ప్రయాణికుల కోసం మియాపూర్ ఆర్టీసీ మియాపూర్ డిపో-1 నుండి సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నామని మేనేజర్ రామయ్య తెలిపారు.
ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు నగరం నుండి శ్రీశైలంకు వెళ్లే భక్తులకు మియాపూర్ ఎక్స్ రోడ్డు నుండి సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. రాత్రి 9 గంటల నుండి 11 గంటల వరకు ప్రతి 30 నిమిషాలకొకసారి బస్సు నడుపుతున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9959226153లో సంప్రదించాలని తెలిపారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బండారి లేఅవుట్‌లోని దక్షిణాభిముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ విజయలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో చతుస్థానార్చనలు, వాస్తు హోమం, పుష్పాదివాసం కార్యక్రమాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్పొరేటర్ జ్యోతి, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారాజు, సెక్రటరీ రవీంద్రబాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కిషోర్, సభ్యులు వెంకన్న, మూర్తి, నగేష్, బాలరాజు, శివ, ఉమాశంకర్, శేషయ్య, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చెస్‌లో విఘ్నేష్ ప్రతిభ



మియాపూర్: జాతీయస్థాయి చెస్ పోటీల్లో మియాపూర్‌లోని జేపీఎన్‌నగర్ కాలనీలోని క్లియోస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి విఘ్నేష్ ప్రతిభ చాటాడు. తమిళనాడు హోసూరులో ఆలిండియా చెస్ ఫెడరేషన్ నిర్వహించిన పోటీల్లో అండర్-15 విభాగంలో విఘ్నేష్ ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రావూస్ గ్రూపు విద్యా సంస్థల అధినేత ప్రభాకర్‌రావు విఘ్నేష్‌ను సన్మానించారు. సీఈఓ నితిన్‌రావు, అకడమిక్ డైరెక్టర్ శశిరేఖ, కో ఆర్డినేటర్ విజయలక్ష్మీ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నీడ లేక అవస్థలు

- బస్ షెల్టర్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- మూసాపేట, అల్లాపూర్ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి
- ఎండలోనే నిల్చోవాల్సి వస్తోందని ప్రయాణికుల ఆవేదన
- పట్టించుకోని అధికారులు



కబీర్‌నగర్ చౌరస్తాలో రోడ్డుపైనే నిల్చొని బస్ ఎక్కుతున్న ప్రయాణికులు

మోతీనగర్: బస్‌షెల్టర్‌లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మూసాపేట, అల్లాపూర్ డివిజన్లలోని కబీర్‌నగర్, మోతీనగర్, అల్లాపూర్ తదితర ప్రాంతాల్లో అధునాతన బస్ షెల్టర్‌లు నిర్మిస్తామని చెప్పిన అధికారులు పాత వాటిని తొలగించారు. అప్పటి నుంచి ప్రయాణికులు రోడ్డు పైనే నిల్చుని బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో బస్‌స్టాప్‌లు చిరు వ్యాపారులకు అలంకార ప్రాయంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో అవసరం ఉన్నప్పటికీ సంవత్సరాలు గడుస్తున్నా బస్‌స్టాప్‌లు నిర్మించడం లేదు. ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆటో వాలాల ఆగడాలకు హద్దు లేకుండా పోతోంది. ఉదయం 4 నుంచి రాత్రి 12 వరకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి మోతీనగర్ మీదుగా బోరబండ వరకు బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అయినప్పటికీ షెల్టర్‌లు లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి వెంటనే అవసరం ఉన్న ప్రాంతాల్లో షెల్టర్‌లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మోతీనగర్ చౌరస్తాలో ఎండలో నిల్చొని బస్ కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

- మోతీనగర్ చౌరస్తాలో బస్ షెల్టర్ నిర్మాణం కోసం ఉమ్మడి రాష్ట్రంలో మూడు సార్లు శంకుస్థాపన చేశారు. అయితే ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.
- కబీర్‌నగర్‌లో ఉన్న బస్‌షెల్టర్‌ను తొలగించి వాటర్ ఏటీఎం ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం అది నిరుపయోగంగా మారింది.
- మోతీనగర్ చౌరస్తాలో రోడ్డుకు ఇరువైపులా బస్సు షెల్టర్‌లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

అధికారులు స్పందించాలి



మోతీనగర్ చౌరస్తాలో బస్సు షెల్టర్‌లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో షెల్టర్ ఉన్నప్పటికీ కొత్తది నిర్మిస్తామని చెప్పి దానిని తొలగించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి.
–నల్లమాల్లు అంజిరెడ్డి, ఎంసీహెచ్ఎస్ అధ్యక్షుడు

కార్యకర్తలతో ఎమ్మెల్యే కృష్ణారావు సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: నియోజకవర్గం పరిధిలోని కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆయన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17న నూతనంగా ప్రారంభం కానున్న సచివాలయానికి కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లాలన్నారు. దీనికి సంబంధించి ఈ నెల 13న నిర్వహించే కార్యకర్తల సమావేశంపై చర్చించారు. సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడంతో పాటు ఆయన విగ్రహానికి 16వ తేదీన పాలాభిషేకం చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని, ఎక్కడైనా పెండింగ్ పనులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేవలం ఎనిమిదిన్నరేళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపారన్నారు.

అధికారులతో జెడ్సీ సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ వి.మమత, టౌన్ ప్లానింగ్ అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో శుక్రవారం జోనల్ కమిషనర్ వి.మమత పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోర్టు కేసులపై సమీక్ష నిర్వహించి, ఇప్పటి వరకు కౌంటర్ ఫైల్ చేయని కేసులకు బుధవారం లోపు కౌంటర్ దాఖలు చేయాలని సంబంధిత సర్కిళ్ల ఏసీపీలు, ఉప కమిషనర్లను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులపై, వాటిపై తీసుకుంటున్న చర్యలపై సర్కిళ్ల వారీగా సమీక్షించారు. అనుమతులు లేని, అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలపై కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలని, సాధ్యమైనంత వరకు నిర్మాణ ప్రారంభ దశలోనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమ నిర్మాణలపై అలసత్వం వహిస్తే అధికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్ల విస్తరణ, నాలాల విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ చిన్నారెడ్డి, డీసీలు రవికుమార్, రవీందర్‌కుమార్, సీపీ ఉమారాణి, డీసీపీ రఘునందన్, పట్టణ ప్రణాళిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బటర్ ఫ్లై పార్కు సందర్శనలో..

బటర్ ఫ్లై పార్కు పరిశీలన..

మూసాపేట వార్డు నెంబర్ 115లో అభివృద్ధి చేస్తున్న బటర్ ఫ్లై పార్కు, జిమ్ పార్కును శుక్రవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలు సూచనలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. సీతాకోక చిలుకలను ఆకర్షించే విధంగా పూల మొక్కలు ఏర్పాటు చేయడం ఈ పార్కు ప్రత్యేకత అన్నారు. సీతాకోక చిలుకలతో సెల్ఫీలు దిగే విధంగా సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీడీ పద్మనాభన్, మేనేజర్ సీహెచ్ విజయరాణి, హార్టికల్చర్ అసిస్టెంట్ సమత పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'హాత్ సే హాత్ జోడో' యాత్ర



దిల్‌కుష్‌నగర్‌లో యాత్ర నిర్వహిస్తున్న సత్యం శ్రీరంగం తదితరులు

బాలానగర్: పీసీసీ సభ్యుడు డా.సత్యం శ్రీరంగం ఆధ్వర్యంలో జరుగుతున్న హాత్ సే హాత్ జోడో యాత్ర శుక్రవారం దిల్‌కుష్‌నగర్‌లో 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ రాహుల్ గాంధీ సందేశాన్ని కరపత్రాల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు గూడ ఐలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. గడప గడపకు వెళ్లి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అక్రమాలు, వారు ఇచ్చిన హామీలు, అన్ని వర్గాల ప్రజలకు చేసిన మోసాల గురించి వివరిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చేపట్టే పనుల గురించి ప్రజలకు చెప్తున్నామని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దిల్‌కుష్‌నగర్‌లో జరిగిన ప్రతి అభివృద్ధి పనిలో కాంగ్రెస్ పార్టీకి భాగస్వామ్యం ఉందన్నారు. ఇంటింటి పాదయాత్రలో అనేక మంది పింఛన్లు, నిరుద్యోగ భృతి గురించి అడుగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, ఏ-బ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, సీనియర్ నాయకులు శామ్యూల్, నల్లోల రాజేందర్, క్రిష్ణారాజ్‌పుత్, మట్టే ప్రసన్నకుమార్, బాలాపీర్, నవాబ్, షాజీదా బేగం తదితరులు పాల్గొన్నారు.

అభినందన



ప్రణయ్‌ని అభినందిస్తున్న ప్రొఫెసర్‌లు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ఎంటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బొజ్జ ప్రణయ్ ఫిబ్రవరి 27న తమిళనాడులో జరిగిన జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. దీంతో శుక్రవారం ప్రణయ్‌ని యూనివర్సిటీ కళాశాల విభాగాధిపతులు ప్రొఫెసర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ అంజిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల కళాశాల విద్యార్థి ప్రతిభ

భాగ్యనగర్‌కాలనీ: బాలానగర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల బాయ్స్-1లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎం.ఉమేశ్‌యాదవ్ శుక్రవారం విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో 87.5 శాతం మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డా.పి.కల్పన ఉమేశ్‌యాదవ్‌ను అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థులు బాగా చదివి మరిన్ని ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఆమె సూచించారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్లు జరుగుతున్నాయని, వివరాలకు 914029881806, 7989486938, 7569241410 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా శివోత్సవాలు

మియాపూర్ : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత వెంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయంలో శ్రీ భవానీ శంకరాలయం త్రయోవింశ శివోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సామూహిక లక్ష కుంకుమార్చన, నిత్యహోమం చేశారు. చుట్టపక్కల కాలనీల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ప్రసాదాలు స్వీకరించారు.

పల్టీ కొట్టిన కారు.. తప్పిన ప్రమాదం

కేపీహెచ్‌బీకాలనీ: వేగంగా వెళ్తున్న కారు ముందు టైర్ పేలడంతో అదుపుతప్పి డివైడర్ ఎక్కి పల్టీ కొట్టిన ఘటన శుక్రవారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అయితే అదృష్టవశాత్తూ కారులో ఉన్న ఇద్దరికీ ఎలాంటి గాయాలు కాలేదు. మణికొండకు చెందిన ఎం.వి.కిషోర్ కుమారుడు సాయితో కలిసి కేపీహెచ్‌బీ కాలనీ నుంచి ఫోర్త్ ఫేజ్ మీదుగా మూసాపేట వైపు వెళ్తున్నాడు. లోధా అపార్టుమెంట్స్ వద్దకు రాగానే కారు ముందు టైర్ పేలిపోయింది. దీంతో అదుపుతప్పిన కారు రోడ్డు డివైడర్ ఎక్కి పల్టీ కొట్టింది. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు కారులో ఉన్న కిషోర్, సాయిని బయటకు తీశారు. వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కారును రోడ్డుకు అడ్డుగా లేకుండా పక్కకు తీశారు. టైర్ పేలిపోవడంతోనే కారు పల్టీ కొట్టినట్లు గుర్తించారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు మృతి

భాగ్యనగర్‌కాలనీ: ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాలాజీనగర్‌లో నివాసముంటున్న బాబూలాల్ (65) శుక్రవారం ఉదయం తన ఇంటి నుంచి మెట్టుగూడలోని చర్చికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. బాలానగర్ మెట్రో స్టేషన్ కింద రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో అతడి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కూకట్‌పల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

33 కోట్ల మంది హెల్త్ అకౌంట్లు సిద్ధం

- త్వరలో యూహెచ్ఐని ప్రారంభించనున్న ప్రధానమంత్రి
- ఆరోగ్య రంగంలో టెక్నాలజీ వినియోగం పెరిగిందన్న నేషనల్ హెల్త్ అథారిటీ మాజీ సీఈఓ డా.ఆర్ఎస్ శర్మ
- ఐఎస్‌బీలో హెల్త్‌కేర్ 4.0 వార్షిక సదస్సు నిర్వహణ



రాయదుర్గం: భారతదేశ వ్యాప్తంగా 33 కోట్ల మంది హెల్త్ అకౌంట్లను ఏర్పాటు చేయడం జరిగిందని నేషనల్ హెల్త్ అథారిటీ మాజీ సీఈఓ డాక్టర్ ఆర్ ఎస్ శర్మ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఐఎస్‌బీ మ్యాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ (ఐఎస్‌బీ-ఎంఐహెచ్‌ఎం) ఆధ్వర్యంలో ఐఎస్‌బీ హెల్త్ కేర్ 4.0 పేరిట ప్రత్యేక సదస్సును ఐఎస్‌బీలోని ఖేమ్కా ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. ప్రారంభ సమావేశంలో ముఖ్య వక్తగా ఆయన విచ్చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆరోగ్య రికార్డును తయారు చేస్తారని, సాంకేతిక వినియోగం ద్వారా ఆరోగ్య రంగంలో ఎన్నో విజయాలు సాధించేందుకు అవకాశం కలిగిందన్నారు. త్వరలో ఆరోగ్యం రంగంలో అన్ని సేవలను ఒక్కచోట లభించేలా చేయడం కోసం యూనిఫైడ్ హెల్త్ ఇంటర్‌ఫేస్ (యూహెచ్ఐ)ను భారత ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీని ద్వారా అంబులెన్స్, ఫార్మసీ సేవలను ఆన్‌లైన్ ద్వారా పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల మాట్లాడుతూ దేశంలో వైద్య ఆరోగ్య రంగంలో అనేక రకాల సంస్థలు ఉన్నప్పటికీ ఇందులో నాణ్యమైన పరిశోధనల కోసం, సంస్థలు, ప్రొఫెషనల్స్‌ను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ఐఎస్‌బీ మ్యాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ-ఎంఐహెచ్‌ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సారంగదేవ్‌తోపాటు పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



డీకే ఎన్‌క్లేవ్ కాలనీలో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్ : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌లోని డీకే ఎన్‌క్లేవ్ కాలనీలో రూ.20.15లక్షల వ్యయంతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులకు శుక్రవారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోఅభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. నాయకులు గంగాధర్ రావు, అన్వర్ షరీఫ్, రోజా, సుప్రజ, మల్లేష్, కాలనీ అధ్యక్షులు విజయ్, ఉపాధ్యక్షులు రాంబాబు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కండ్లకోయలో కంటి వెలుగు ప్రారంభం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ 10వ వార్డు పరిధి కండ్లకోయలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని కమిషనర్ రాములు, వైస్ చైర్మన్ ప్రభాకర్‌తో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. గ్రా మంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలువురు గ్రామస్తులకు మందులు, కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మున్సి పల్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ చెరువులో దోమల మందు పిచికారీ



దోమల మందు పిచికారీ చేయిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువుతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రజలు దోమల బెడద ఎక్కువగా వుందని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బందితో కలిసి ఎల్లమ్మ చెరువులో డ్రోన్ సహాయంతో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. ప్రజలందరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాలనీ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ఉదయం వచ్చే ఆటో, రిక్షా కార్మికులకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ ఉషారాణి, సూపర్‌వైజర్ డి.నరసింహులు, ఎంటమాలజీ సిబ్బంది, నాయకులు రాజేష్‌చంద్ర, గుడ్ల శ్రీనివాస్, వెంకట్‌నాయక్, శివరాజ్‌గౌడ్, షౌకత్‌ఆలీ మున్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు



పోలీస్ అధికారులతో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి (ఫైల్)



ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్

నిజాంపేట్: ప్రజాప్రతినిధిగా అభివృద్ధి పనులు చేపడుతూనే సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని తన వార్డులో ప్రభుత్వ నిధులతో పాటు తన సొంత నిధులను సైతం వెచ్చించి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు.

- 18వ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో ప్రజల వ్యక్తిగత అవసరాల కోసం షెడ్లను ఏర్పాటు చేశారు. కావ్యశ్రీ హోమ్స్, సాయిఅనురాగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో సొంత నిధులతో షెడ్లు ఏర్పాటు చేసి గణపతి, దుర్గా నవరాత్రోత్సవాలతో పాటు, ఇతర సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు వినియోగిస్తున్నారు.
- సొంత ఖర్చులతో స్థానిక యువత కోసం లైబ్రరీ ఏర్పాటు చేయడంతో పాటు కల్యాణ మండపంలో వధూవరులకు విడివిడిగా గదులు నిర్మించారు.
- యువతకు క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేయడంతో పాటు క్రీడలను నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు.
- డివిజన్ పరిధిలో ఉన్న పార్కుల్లో వృద్ధులు, మహిళలు కూర్చునేందుకు తన తండ్రి పద్మారెడ్డి జ్ఞాపకార్థం బెంచీలు ఏర్పాటు చేయించారు.
- యువత కోసం టక్‌లేన్ కాలనీలో జిమ్ ఏర్పాటు చేసి వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉంచారు.
- కరోనా కష్టకాలంలో స్థానికులు, వలస కార్మికులను అన్ని విధాలుగా ఆదుకున్నారు. వారికి ఆహారం అందించడంతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. ప్రజలకు సొంత ఖర్చులతో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.
- డివిజన్ పరిధిలోని సాయిఅనురాగ్ కాలనీలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడంతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు చెక్కు అందజేశారు.

పేదలను ఆదుకునేందుకే..

తనను ఎన్నుకున్న ప్రజలకు ఏదో ఒకటి చేయాలనే తపన ఉంది. ప్రభుత్వ నిధులతో ఇప్పటికే డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, తాగునీటి, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చా. పేదలను ఆదుకునేందుకు సామాజిక కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నా.
– కొలన్ వీరేందర్‌రెడ్డి, కార్పొరేటర్